క్లుప్తంగా

అదనపు కలెక్టర్‌కు శుభాకాంక్షలు



జనగామ: జనగామ జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా బాధ్యతలు స్వీకరించిన రోహిత్‌సింగ్‌కు బీఆర్‌ఎస్ జనగామ నియోజకవర్గ కోఆర్డినేటర్ గుజ్జు సంపత్ రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి సోమవారం శుభాకాంక్షలు తెలిపారు.

నియామకం



స్టేషన్‌ఘన్‌పూర్: బీఆర్‌ఎస్ శివునిపల్లి పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గ్రామానికి చెందిన పార్టీ నాయకుడు చిక్కుడు రమేష్‌ముదిరాజ్‌ను నియమించినట్లు ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య తెలిపారు. ఈ మేరకు గ్రామంలో సోమవారం ఆయనకు ఎమ్మెల్యే నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చిక్కుడు రమేష్ మాట్లాడుతూ పార్టీలో తాను చేస్తున్న కృషిని గుర్తించి శివునిపల్లి గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించడం సంతోషంగా ఉందన్నారు. పదవిలో నియమించిన ఎమ్మెల్యే రాజయ్యకు, సహకరించిన పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ

చిల్పూరు: వ్యాపారవేత్త మారెం లింగమూర్తి తల్లి అన్నమ్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాజయ్య బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ఎంపీపీ బొమ్మిశెట్టి సరితబాలరాజు, సర్పంచ్ రాజ్‌కుమార్, ఎంపీటీసీ సాదం నర్సింహులు, ఉప సర్పంచ్ మహేందర్, మహ్మద్ షకీల్, పొన్నం శ్రీనివాస్, పంతం రాజు, కలకోల రజనీకుమార్, జిల్లా రాజు ఉన్నారు.

ఎర్రబెల్లి స్వర్ణను కలిసిన సింగపురం ఇందిర



స్టేషన్‌ఘన్‌పూర్: కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా నూతన అధ్యక్షురాలిగా నియమితులైన ఎర్రబెల్లి స్వర్ణరాజేశ్వరరావును హనుమకొండలోని వారి నివాసంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు లింగాల సుభాష్‌రెడ్డి, యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కీసర దిలీప్‌రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు శివరాజు, ఎస్.నాగయ్య, అనీల్‌కుమార్, సదానందం, కోరుకొప్పుల మహేందర్, చింత జ్యోత్స్న, పద్మతోపాటు తదితరులు పాల్గొన్నారు.

వేం నరేందర్‌రెడ్డికి పరామర్శ

టీపీసీసీ ఉపాధ్యక్షుడు వేంనరేందర్‌రెడ్డి సోదరుడు పురుషోత్తంరెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా సోమవారం హనుమకొండలో నరేందర్‌రెడ్డిని, వారి కుటుంబ సభ్యులను ఇందిర పరామర్శించారు.

'అంగన్‌వాడీ'లో సీమంతం



బచ్చన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య లభిస్తుందని మండలంలోని కొడవటూర్ అంగన్ వాడీ టీచర్ ప్రేమలక్ష్మి అన్నారు. సోమవారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమలక్ష్మి మాట్లాడుతూ అంగన్ వాడీ సేవలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు వినియోగించుకోవాలని అన్నారు.

ఆర్థికసాయం



బచ్చన్నపేట: మండలంలోని పోచన్నపేటలో బోడ బీరయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులకు గ్రామానికి చెందిన నాయకుడు పోతుల రాములు ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. నాయకులు తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా హాస్టల్ భవనం

- రూ.లక్షలు వెచ్చించి లక్షణంగా వదిలేశారు
- తాటికొండలో శిథిలావస్థకు చేరుతున్న భవనం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



శిథిలావస్థకు చేరుకున్న తాటికొండలోని హాస్టల్ భవనం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలో ఎంతో ఘనమైన చరిత్ర ఉన్న తాటికొండలో ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్ భవనం నిరుపయోగంగా మారి దాదాపు ఎనిమిదేళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. ఎస్సీ స్టాండింగ్ కమిటీ చైర్మన్, ఘన్‌పూర్ జెడ్పీటీసీ సభ్యుడు మారపాక రవి స్వగ్రామమైన తాటికొండలో ప్రభుత్వ భవనం నిరుపయోగంగా మారి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోకపోవడం అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టింపులేని తనానికి నిదర్శనంగా నిలుస్తోంది. మండల పరిషత్ వైస్ చైర్మన్ చల్లా సుధీర్‌రెడ్డి స్వగ్రామం కూడా తాటికొండ కావడం విశేషం. తాటికొండ తమ అమ్మమ్మగారి ఊరని, తాటికొండ అంటే ఎనలేని ఇష్టమని పలుమార్లు చెప్పే ఆ గ్రామం పేరునే తమ ఇంటిపేరుగా మార్చుకున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సైతం ఈ అంశంపై స్పందించడం లేదు. వివరాలు ఇలా ఉన్నాయి. గతంలో తాటికొండతో పాటు తాటికొండ చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు హైస్కూల్ చదువును తాటికొండలో చదువుకునే వారు. అయితే ఆరోజుల్లో తాటికొండలో హాస్టల్ లేకపోవడంతో విద్యార్థులు వివిధ గ్రామాల నుంచి ఇక్కడకు వచ్చి చదువుకునే క్రమంలో రోజూ పాఠశాలకు వచ్చి వెళ్లేందుకు తీవ్ర అవస్థలకు గురయ్యేవారు. దాంతో విద్యార్థులు, తల్లిదండ్రుల కోరిక మేరకు అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రి కడియం శ్రీహరి ఆధ్వర్యంలో 1997లో తాటికొండలో సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతిగృహాన్ని రూ. లక్షలు వెచ్చించి నిర్మింపజేశారు. తాటికొండ హాస్టల్ స్టేషన్‌ఘన్‌పూర్ మండలం తాటికొండ, కొత్తపల్లి, జిట్టెగూడెం, ప్రస్తుత చిల్పూరు మండలం కృష్ణాజీగూడెం, ఫతేపూర్, గార్లగడ్డతండా తదితర గ్రామాల విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా మారింది. ఆయా గ్రామాల విద్యార్థులు ఇక్కడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటూ తాటికొండ హాస్టల్‌లో ఉండేవారు.

మూతపడిన హాస్టల్..

మొదట్లో హాస్టల్ విద్యార్థులతో కళకళలాడేది. అయితే కాలక్రమేణా విద్యావ్యవస్థలో, సాంఘిక సంక్షేమ శాఖలో వచ్చిన మార్పులతో హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. చుట్టుపక్కల గ్రామాల్లో ప్రైవేటు పాఠశాలలు ఏర్పాటు కావడం, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ కావడం జరిగింది. దాంతో హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. సాంఘిక సంక్షేమ శాఖలో వచ్చిన నూతన నిబంధనల మేరకు హాస్టల్‌లో నిర్దేశించిన సంఖ్య కన్నా తక్కువ విద్యార్థులున్న హాస్టళ్లను మూసివేశారు. దాంతో 2015 సంవత్సరం వరకు కాస్త అటు ఇటుగా నడిచిన హాస్టల్ 2015లో పూర్తిగా మూతపడింది.

శిథిలావస్థవకు చేరుకున్న హాస్టల్ భవనం

మూతపడిన హాస్టల్ భవనాన్ని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. హాస్టల్ భవనం ఆవరణలో పెద్ద ఎత్తున పిచ్చిమొక్కలు పెరిగి శిథిలావస్థకు చేరింది. దానికి తోడు కొందరుస్థానికులు అందులోనే పశువులను కట్టేస్తుండగా పశువుల కొట్టంగా మారుతుంది. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనం ఏళ్ళ తరబడి నిరుపయోగంగా శిథిలావస్థకు చేరినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వృద్ధాశ్రమం చేస్తే బాగుంటుంది



"గ్రామంలో నిరుపయోగంగా మారిన ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్ భవనాన్ని స్వల్ప మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలి. గ్రామంలో అనాథ వృద్ధులు, ఎవ్వరూ లేని ఒంటరి వారికి ఆశ్రమం చేస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

– మారపాక నాగరాజు

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ హాస్టల్ భవనం సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. స్థానిక ఎమ్మెల్యే రాజయ్య, జెడ్పీటీసీ మారపాక రవి సహకారంతో త్వరలో భవనాన్ని వినియోగంలోకి తీసుకువచ్చి గ్రామ అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకుంటాం.

– చల్లా సుధీర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ

యాదవుల భూముల జోలికొస్తే ఊరుకోం..

యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్



మాట్లాడుతున్న మేకల రాములు

జనగామ రూరల్: యాదవుల భూముల విషయంలో బీఆర్‌ఎస్ నాయకులు వస్తే ఊరుకునేది లేదని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములు యాదవ్ హెచ్చరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బచ్చన్నపేటలో సర్వే నంబర్ 580-అ/1/ఈ, 580-అ/1/ఉ,580/ఈ 582/ఈ/1లో మార్క శంకరయ్య, మార్క అంజయ్య, మార్క ఈశ్వరయ్య వంశపారంపర్యంగా భూమి పట్టా పాస్ పుస్తకాలు పొందారన్నారు. కాగా, అధికారాన్ని అడ్డుపెట్టుకొని జెడ్పీటీసీ భర్త గిరబోయిన అంజయ్య, మాజీ ఎంపీపీ జిల్లా బుచ్చయ్య మరికొంత మంది బీఆర్‌ఎస్ నాయకులు భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తూ ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డికాలనీగా నామకరణం చేసి బోర్డు పాతి పట్టాదారులను బెదిరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామరు. అనంతరం ఈ విషయమై జిల్లా కలెక్టర్ శివలింగయ్యకు ఫిర్యాదు చేశారు. యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు దేవేందర్ యాదవ్, జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, నల్గొండ జిల్లా అధ్యక్షుడు తిరుగుడు రవి, వెంకట నరసింహులు యాదవ్, చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సేవలు వెలకట్టలేనివి

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, చిత్రంలో దేవులపల్లి అమర్

జనగామ రూరల్: తెలంగాణ రాష్ట్ర సాధనలో జర్నలిస్టుల సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని విజయ ఫంక్షన్ హాల్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ద్వితీయ మహాసభలు జిల్లా అధ్యక్షుడు బి.ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ ప్రభుత్వ జాతీయ మీడియా సలహాదారుడు దేవులపల్లి అమర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని జర్నలిస్టులు గల్లీ నుంచి ఢిల్లీ వరకు అన్ని వర్గాల ప్రజలను మమేకం చేసి రాష్ట్ర సాధనలో విశేషంగా కృషి చేశారని అన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల ప్రాంతంలో ఐదెకరాలు చూశామని, త్వరలో అందించడానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం దేవులపల్లి అమర్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జర్నలిస్టుల సంక్షేమానికి ఐజేయూ విశేషంగా కృషి చేస్తుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం కాకుండా సామాజిక స్పృహ ఉండేలా ప్రతీ ఒక్కరూ వృత్తిని నిర్వర్తించాలన్నారు. ఆయా పత్రిక యాజమాన్యాలు జర్నలిస్టులకు వేజ్ బోర్డు ప్రకారం వేతనాలు ఇవ్వాల్సి ఉండగా అమలు చేయడం లేదని ఈ క్రమంలో ఐక్య ఉద్యమాలు చేపట్టాలని కోరారు. జర్నలిస్టులకు ఇళ్లు, ఆరోగ్య భద్రత, ప్రమాదాల్లో మృతి చెందిన వారిని ఆదుకోవడంలో సంఘం ముందుందని తెలిపారు. రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం ప్రధాన కార్యదర్శి కె.విరాహత్ అలీ, కార్యదర్శి గాడిపల్లి మధు, జాతీయ కౌన్సిల్ సభ్యుడు దాసరి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎ.రాజేష్, మాధవరావు, జిల్లా కార్యదర్శి భిక్షపతితో పాటు జర్నలిస్టులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా కమిటీ ఎన్నిక

తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం (ఐజేయూ) జిల్లా కమిటీని సోమవారం జిల్లా కేంద్రంలోని విజయ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర కార్యదర్శి మధు, జాతీయ కౌన్సిల్ సభ్యుడు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బొల్లు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.భిక్షపతి, కోశాధికారిగా ఓరుగంటి సంతోష్ ఎన్నికయ్యారు. అలాగే ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడిగా ఉపేందర్ ఎన్నికయ్యారు.

క్రీడల్లో రాణించాలి



బచ్చన్నపేట: ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని బాండి అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు చల్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 17 సంవత్సరాల లోపు పిల్లలకు అన్ని రకాల క్రీడల పట్ల పోటీలను నిర్వహించామన్నారు. పోటీల్లో గెలుపొందిన వారిని జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడలకు పంపిస్తున్నామని అన్నారు. ఇటీవల నిర్వహించిన క్రీడల్లో క్రీడాకారులు పతకాలను సాధించినారని చెప్పారు.

విద్యుత్ విజయోత్సవం



బచ్చన్నపేట: అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చేస్తున్నామని లైన్‌మన్ మెతుకు జలేందర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పలు సబ్‌స్టేషన్లలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ విజయోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం

విద్యారణ్యపురి: సివిల్స్ సర్వీసెస్ ఫలితాల్లో 646వ ర్యాంకు సాధించిన మంద అపూర్వను తెలంగాణ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో పలువురు సన్మానించారు. నగరంలోని సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమానికి అపూర్వను శాతవాహన యూనివర్సిటీ మాజీ ఉపకులపతి మహ్మద్ ఇక్బాల్ అలీ, కేయూ ప్రొఫెసర్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ సోమవారం అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లారి మధు, కందగట్ల సుధాకర్, విష్ణు, ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకుడు ఓంకార్, కేయూ అధ్యాపకుడు ఎర్రబొజు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సర్పంచ్ తదితరులు

చిల్పూరు: పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని సర్పంచ్ కొంగరి రవి అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామంలో సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో పంచాయతీ కార్యదర్శి కందగట్ల శ్రీధర్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బబ్బుల వంశి, ఎంపీటీసీ మునిపల్లి సుధాకర్, వెన్నం మాధవరెడ్డి, అలుగు అశోక్, మేడ్చల్ రమేష్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన ఘన్‌పూర్ శ్మశానవాటిక వద్ద నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ తాటికొండ సురేష్‌కుమార్, ఉపసర్పంచ్ నీల ఐలయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో భాగంగా శ్మశానవాటిక సమీపాన రూ.10లక్షల నిధులతో సీసీ రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని, ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమన్నారు. వార్డు సభ్యులు చట్ల మంగ, గట్టు వాణి, గోనెల రేణుక, సుమలత, కొంగరి వేణు, కొలిపాక వేణు, ఊరడి లింగం, నరేందర్, శోభన్‌బాబు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి నిరంతర కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

రఘునాథపల్లి: అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అయ్యవారిగూడెం, కుర్చపల్లి, గోవర్ధనగిరి, కోమళ్ల, మల్లంపల్లి, శివాజీనగర్, కంచనపల్లిలో ఆయన ప్రగతి నివేదన యాత్ర చేపట్టారు. అయా గ్రామాల్లో ప్రజాసమస్యలు తెలుసుకొని వాటిని సత్వరం పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. కంచనపల్లి రైతు వేదికలో ఎమ్మెల్యే పల్లె నిద్ర చేశారు. తహసీల్దార్ ఎండి అన్వర్, జెడ్పీటీసీ బొల్లం మణికంఠ, బీఆర్‌ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వై కుమార్‌గౌడ్, మండల అధ్యక్షుడు వారాల రమేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముసిపట్ల విజయ్, సర్పంచ్‌లు పోకల శివకుమార్, గవ్వాని విజయనాగేశ్వర్, శంకరి అనిత, పారునంది కొమురయ్య, గంపల శేఖర్, బొల్లపల్లి మంజుల, ఎంపీటీసీలు కేమిడి రమ్యరాజు, బొల్లపల్లి సరోజన, విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ చీమలపాటి రవీందర్, మడ్లపల్లి సునిత, తిప్పారపు రమ్యబాబురావు, మమత, పాల్గొన్నారు.

ఆలయ స్థలం కబ్జాదారులపై చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

రఘునాథపల్లి: మండల కేంద్రంలో బస్టాండ్ సమీపంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ స్థలం కబ్జాచేస్తున్న అక్రమార్కులపై ఉన్నతాధికారులు వెంటనే కఠిన చర్య తీసుకోవాలని బీజేపీ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. బస్టాండ్ సమీపంలో కబ్జాకు గురవుతున్న ఆలయ స్థలాన్ని సోమవారం బీజేపీ నాయకులు పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. దశాబ్దాల క్రితం భూస్వామి లింగాల వెంకటరంగారెడ్డి బస్టాండ్ సమీపంలో 316 సర్వే నంబర్‌లోని 16 గుంటల భూమిని ప్రజా అవసరాల నిమిత్తం గ్రామానికి విరాళంగా ఇచ్చారన్నారు. నాటి నుంచి కొందరు స్థానిక నిరుపేదలు డబ్బాలు వేసుకొని జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. విలువైన స్థలం తమదంటూ అక్రమార్కులు తప్పుడు పాసుబుక్కులను సృష్టించి కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. ఈ రూ.2 కోట్ల విలువైన స్థలం కబ్జా కుట్రలో కీలక సూత్రదారి స్థానిక ప్రజాప్రతినిధిగా విమర్శించారు. ఇప్పటికైనా ఆలయ స్థలం కబ్జా యత్నాన్ని విరమించుకోవాలని, లేని పక్షంలో గ్రామస్తులతో కలిసి ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు. బీజేపీ మండల అధ్యక్షుడు వల్లాల వెంకటేష్‌యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి ద్యావర రాజు, జిల్లా కార్యదర్శి వల్లాల ఉపేందర్, జిల్లా అధికార ప్రతినిధి మంద వెంకటేష్‌యాదవ్, సీనియర్ నాయకులు కల్వగూరి ప్రభాకర్, కావటి ముత్యాలు, దుబ్బాక పరుశరాములు, పేర్ని మల్లేష్, కట్ట రాజేష్ ఉన్నారు.

పర్యావరణానికి హానిచేసే ప్లాస్టిక్‌ను నివారిద్దాం..

విద్యారణ్యపురి: పర్యావరణానికి హానిచేసే ప్లాస్టిక్‌ను ప్రతిఒక్కరూ నిషేధించాలని సైకిల్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగా గోపాల్‌రెడ్డి సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం.. జీవవైవిధ్యంతో పాటు మానవ ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతుందని అన్నారు. కార్యక్రమంలో సభ్యులు అనంత్‌వేణు, సాంబమూర్తి, సురేందర్, సాంబయ్య, రాజమౌళి, రాజు, నర్సయ్య, అలీ, శేఖర్‌గౌడ్, జయప్రసాద్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ సేవలను వినియోగించుకోండి



సేవాకేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ శిరాజ్‌గుప్తా

నర్మెట: ఎస్‌బీఐ సేవలను ఖాతాదారులు వినియోగించుకోవాలని సర్పంచ్ రామిని శిరాజ్‌గుప్తా, ఖిలాషాపూర్ శాఖ మేనేజర్ బిల్ల నాగరాజు అన్నారు. మండలంలోని మచ్చుపహాడ్‌లో బీసీ పాయింట్ వినియోగదారుల సేవాకేంద్రాన్ని సోమవారం ప్రారంభించి వారు మాట్లాడారు. జీరో అకౌంట్ మొదలు అన్నిరకాల ఖాతాలు, నగదు లావాదేవీలు, నగదు బదిలీలు తదితర సౌకర్యములు అందుబాటులో ఉంటాయని అన్నారు. లోక్యా తండా సర్పంచ్ లకావత్ కిరణ్ కుమార్, గ్రామ ఉప సర్పంచ్ కొంపెల్లి రాజు, నాయకులు వేల్పుల రాజు, గుండేటి రాజశేఖర్, రాయారపు రాజశేఖర్, నాగపురి రాజు, కొంపెల్లి అంబేడ్కర్, నర్సింహులు, గొల్లపల్లి రాజశేఖర్, బైకాని రంజిత్, పంచాయతీ కార్యదర్శి దామెర వంశి పాల్గొన్నారు.

విద్యుత్ లైన్ల మరమ్మతులు ఎప్పుడో..?



నేలకూలిన విద్యుత్ లైన్

- అధికారుల నిర్లక్ష్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు



కూలిన విద్యుత్ స్తంభం

దేవరుప్పుల: వ్యవసాయ రైతుల పంటల సాగుకు అదను వచ్చినా విద్యుత్ లైన్ల మరమ్మతుల విషయంలో అధికారుల నిర్లక్ష్యంపై సర్వత్రావిమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని సీతారాంపురంలో గుంటోళ్ల ఏరియాలో ఇటీవల గాలిదుమారానికి ట్రాన్స్‌ఫార్మర్ పరిధి స్తంభాలు నేలకూలాయి. రోహిణికార్తె రావడంతో నార్లు పోసేందుకు సన్నద్ధమవుతున్న తరుణంలో విద్యుత్‌లైన్ పునరుద్ధరించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై ఏఈ సుధాకర్ వివరణ కోరగా విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపట్టే కాంట్రాక్టర్లు సమ్మెలో ఉండడం వల్ల సత్వరమే పనులు చేపట్టలేకపోయామని, ఆ ఏరియా రైతులకు ప్రత్యామ్నాయ కరెంట్ ఇచ్చేందుకు చర్యలు చేపడుతామన్నారు.